మనం


నిజామాబాద్
కామారెడ్డి
శుక్రవారం । 17 । ఏప్రిల్ । 2026 పేజీలు: 7



# రాజ్యసభ సభ్యుడిగా

## వేం నరేందర్ రెడ్డి ప్రమాణస్వీకారం

కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): రాజ్యసభ సభ్యునిగా వేం నరేందర్ రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, వివేక్తో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ప్రజాపాలనతో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సమావేశం.
- ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయడమే ప్రధాన లక్ష్యం.
- గ్రామ స్థాయి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి.
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.





2

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సదాశివనగర్ మండలంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి**

2



# ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**- సీపీ సాయిచైతన్య.**



2

‘అరైవ్ అలైవ్’ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసుల పురోగతిపై సీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎక్కువకాలంగా పెండింగ్లో ఉన్న కేసులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సీపీ సూచించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి.**



నిజామాబాద్, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సిరికొండలోని ఏజీ దాస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మండల సభలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ఒక్కో పథకం వారీగా అధికారులు వెల్లడించారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ తదితర వాటి ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో చేకూరిన ప్రయోజనాల గురించి సభలో తమ అభిప్రాయాలు తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ., ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. పసుపు రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, వారికి మేలు చేకూర్చడమే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు భరోసా కల్పించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించాలనే ఉద్దేశంతో స్థానిక మార్కెట్ యార్డులో పసుపు అమ్మకాలలో బహిరంగ వేలం విధానాన్ని అమలు చేయడం జరిగిందని అన్నారు. పసుపు పంట క్వింటాలుకు సగటున రూ.16,000 ధర లభిస్తోందని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కావొద్దని, వారి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా చూస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మండలంలో నెలకొని ఉన్న పలు సమస్యలను ప్రస్తావించగా, వాటి పరిష్కారం విషయమై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సభలో మండల ప్రత్యేక అధికారి నాగూరావు, ఎంపీడీవో మనోహర్, తహశీల్దార్ రవీందర్ రావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**- సీపీ సాయిచైతన్య.**



నిజామాబాద్, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసుల పురోగతిపై సీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎక్కువకాలంగా పెండింగ్లో ఉన్న కేసులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సీపీ సూచించారు. కేసుల పురోగతిని తరచూ సమీక్షిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు. నిజామాబాద్లో పెరుగుతున్న వైట్ కాలర్ నేరాలపై ప్రధానంగా సైబర్ మోసాలు, బ్యాంకింగ్ ఫ్రాడ్లు, ఆర్థిక నేరాలు, నకిలీ పత్రాల తయారీ వంటి అంశాలపై చర్చించారు. కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ప్రత్యేక బృందాల ఏర్పాటు చేయాలని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని, ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్లను గుర్తించి, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. హైవే రోడ్లను కలుపుతూ ఉండేటటువంటి లింక్ రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం, రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వా రెడ్డి, నిజామాబాద్ ఇన్చార్జి ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, సీటీసీ ఏసీపీ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సీసీఆర్బీ సీఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం

భీంగల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల స్థాయి సమావేశం పురపాలక కార్యాలయం నందు నిర్వహించడం జరిగిందని కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు సంబంధించిన అనేక అంశాలను ప్రజలకు వివరించారు. వివిధ శాఖల అధికారులు వారి యొక్క ప్రగతి ప్రణాళికను చదివి వినిపించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ శ్రీమతి సంటి లత నర్సయ్య కౌన్సిలర్లు పర్స కుశలత, తోట సతీష్, సందీప్, నీలం రవి, అంజుమ్ అలీ, సంగ్యా నాయక్, ప్రజా ప్రతినిధులు ఆరెపల్లి నాగేంద్రబాబు, బోదిరే నర్సయ్య, వివిధ శాఖల అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాపాలనతో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సమావేశం.**

**- ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయడమే ప్రధాన లక్ష్యం.**

**- గ్రామ స్థాయి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి.**

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**



కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సదాశివనగర్ మండలంలో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని, ఇది అధిక ఆదాయం అందించే పంటగా మారే అవకాశముందని పేర్కొన్నారు.


సర్పంచ్లు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపుపై సమావేశంలో చర్చించారు. త్వరలో మండలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం అందనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎన్వీ గిరి, డీఆర్డీఓ సురేందర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం ఓపెన్ ఇంటర్ విద్యార్థిని ఏడాది కాలం వృథా

భిక్నూర్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): ఒక గురువు విద్యార్థి భవిష్యత్తుకు బాటలు వేయాలి. కానీ ఇక్కడ ఒక ఉపాధ్యాయుడి అజాగ్రత్త ఒక విద్యార్థిని విద్యా సంవత్సరాన్ని ప్రశ్నార్థకం చేసింది. ఫీజు కట్టినా ఆన్లైన్ చేయడంలో విఫలమవ్వడంతో, సదరు విద్యార్థిని పరీక్షలు రాయలేక కన్నీరుమున్నీరవుతోంది.

ఘటన వివరాల్లోకి వెళ్తే., పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన వంగూరు భానుప్రియ ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా దోమకొండ పలుగడ్డకు చెందిన ఉపాధ్యాయుడు రాజేంద్ర ప్రసాద్ను సంప్రదించి, పరీక్షా ఫీజును సకాలంలో అందజేసింది. తన బాధ్యత తీరిందని, పరీక్షలకు సిద్ధమైన భానుప్రియకు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే సమయంలో అసలు విషయం తెలిసి దిగ్భ్రాంతికి గురైంది.



**పొంతన లేని సమాధానాలు చెప్తూ..**

హాల్ టికెట్ గురించి ఉపాధ్యాయుడిని ప్రశ్నించగా, ఆన్లైన్లో అప్లై చేసే సమయంలో 'ఎర్రర్' వచ్చిందని, అందుకే దరఖాస్తు కాలేదని ఆయన పొంతన లేని సమాధానం చెప్పారు. ఫీజు తీసుకున్న తర్వాత బాధ్యతగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండగా, ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం కారణంగా తనకు హాల్ టికెట్ రాలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది.

**జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు...**

ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం వల్ల తన విలువైన ఏడాది కాలం వృథా అయిందని భానుప్రియ వాపోయింది. తనకు జరిగిన అన్యాయంపై జిల్లా విద్యాధికారి కి ఫిర్యాదు చేసింది.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఇలాంటి ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యం వహించిన సదరు ఉపాధ్యాయుడిని బాధ్యుడిని చేస్తూ, విద్యార్థినికి న్యాయం చేయాలి అని పలువురు వాపోయారు. ఒక విద్యార్థిని ఉన్నత చదువుల కోసం పడుతున్న తపనను గుర్తించకుండా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సదరు ఉపాధ్యాయుడి తీరుపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



# ప్రభుత్వ పాఠశాలల దిశా దశ మార్చే మహత్తర కార్యక్రమం

**- ప్రభుత్వ పాఠశాలలకు డ్యూయల్ డెస్కులు.**

**- స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి.**

కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): కామారెడ్డి పట్టణ కేంద్రలో ప్రభుత్వ పాఠశాలల దిశా దశ మార్చే లక్ష్యంతో కామారెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, కే.పి రాజారెడ్డి జనసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని పాఠశాలలకు ఒక్కరోజులోనే డ్యూయల్ డెస్క్ బెంచీలు పంపిణీ చేశారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, అవసరమైన వారికి చేరే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది.

పాఠశాలల్లో డెస్కు పంపిణీ సందర్భంగా విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. పాత సౌకర్యాల స్థానంలో కొత్త డ్యూయల్ డెస్కు ఏర్పాటు కావడంతో విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం అవుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.



# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏపీఎం సునీత

ఇందల్వాయి, ఏప్రిల్ 16( మనం న్యూస్ ): ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి, కేకే తండా గ్రామాలలో ఏబీఎన్ సునీత ఆధ్వర్యంలో గురువారం కొనుగోలు కేంద్రాలను ఐకెపి మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి ఒక్కరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే వారి ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి అసలుకే మోసపోవద్దని హెచ్చరించారు, రాష్ట్ర ప్రభుత్వం రైతులని రాజులుగా చేయడం లక్ష్యంగా పనిచేస్తుందని అందుకు అనుగుణంగానే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రతి గ్రామ గ్రామాన ఏర్పాటు చేస్తుందని సిర్నాపల్లి సర్పంచ్ అనిత సాయి కృష్ణ, ఉప సర్పంచ్ కమ్మరి సుదర్శన్ వెల్లడించారు. ఈ మేరకు గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏపిఎం తో కలిసి గురువారం ప్రారంభించారు. మహిళా సంఘు డ్వాక్రా  అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి కరుణ చుక్కబట్ల గౌతమి, వకీల్ రాజన్న, తదితరులు పాల్గొన్నారు





# రెంజల్లో కీటక జనిత వ్యాధులపై అలర్ట్

**- 30 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం ప్రారంభం.**

రెంజల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): రెంజల్ మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశం ఆరోగ్య పరిరక్షణకు కీలక దిశానిర్దేశాలు ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెంజల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షాహిస్తా ఫిర్దోస్ మాట్లాడుతూ., ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు 30 రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కీటక జనిత వ్యాధులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే అసంక్రమిక వ్యాధుల పరీక్షలు, ఎండాకాలంలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యచ్.పీ.వీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై కూడా వివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం కీటక జనిత వ్యాధులపై ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో, ఎంపీవోతో పాటు ఆరోగ్య విస్తరణ అధికారులు కరిపే రవీందర్, సురేష్ పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# వేం నరేందర్ రెడ్డికి అభినందనలు తెలిపిన జిల్లా నాయకులు

కమ్మర్ పల్లి ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి ని డిల్లీలోని తెలంగాణ భవన్ లో బుధవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డెవలప్మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఆర్మూర్ ఇంచార్జి వినయ్ రెడ్డి, మునిపల్లి సాయిరెడ్డి, బాసా వేణు గోపాల్ యాదవ్ లు వున్నారు.






## ఆర్.కె కళాశాల విద్యార్థినికి ఇన్ఫోసిస్లో ఉద్యోగం

**- 23 వేల మందిలో ఎంపికైన ఆర్.కె విద్యార్థి మిత్ర.**
**- అభినందించిన కళాశాల సీఈఓ డా. ఎం. జైపాల్ రెడ్డి.**

కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని స్థానిక ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు చెందిన ఎం. మిత్ర (డేటా సైన్స్ ఫైనల్ ఇయర్)కు ఇన్ఫోసిస్లో సిస్టమ్స్ అసోసియేట్గా ఉద్యోగం లభించింది. ఈ నియామక డ్రైవ్కు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 23 వేల మంది విద్యార్థులు హాజరుకాగా, కేవలం 8 మంది మాత్రమే ఎంపికయ్యారు. ఇందులో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి ఆర్.కె కళాశాల విద్యార్థినికి అవకాశం రావడం ఆనందదాయకమని కళాశాల సీఈఓ డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., మార్కులు, ర్యాంకులతో పాటు కార్పొరేట్ ఉద్యోగాల్లోనూ ఆర్కే కళాశాల ముందుంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరింత మందికి ఇలాంటి అవకాశాలు కల్పించేందుకు కళాశాల కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవర్ధన్ రెడ్డి, డీన్ నవీన్ కుమార్, టాస్క్ ప్రతినిధి రఘు, ప్లేస్మెంట్ ఆఫీసర్ బాలుమహేంద్రనాథ్, శ్రీధర్, నాగరాజు, రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ స్టేషన్, కొత్త వాహనాలు ఏర్పాటు చెయ్యాలి

**-బిఆర్ఎస్ కౌన్సిలర్ నీలం రవి డిమాండ్.**

భీంగల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): భీంగల్ పట్టణ కేంద్రంలోని ఫైర్ ఆఫీస్ ను 9 వ వార్డు కౌన్సిలర్ నీలం రవి పరిశీలించారు. భీమ్గల్ కి శాశ్వత ఫైర్ స్టేషన్ లేకపోవడం, పాత ఫైర్ ఇంజన్ తో నెట్టుకొస్తున్న వైనం, ఉన్న ఆ పాత వాహనం కూడా గుట్ట ఎక్కలేక మరమ్మతులకు లోనవడం చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే శాశ్వత ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన డిమాండ్ చేశారు.



# డిజిటల్ విద్యలో బీబీపేట్ తిమ్మయ్య గారి సుశీల, నారాయణరెడ్డి పాఠశాల విద్యార్థుల జైత్రయాత్ర.

**- ఖాన్ అకాడమీ సర్టిఫికేట్లు సాధించిన 52 మంది విద్యార్థులు**



బీబీపేట్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు ఖాన్ అకాడమీ మధ్య కుదిరిన ఒప్పందం బీబీపేట్లో సత్ఫలితాలను ఇస్తోంది. కామారెడ్డి జిల్లాలోని తిమ్మయ్య గారి సుశీల-నారాయణరెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థులు గణితం మరియు సైన్స్ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, ప్రతిష్ఠాత్మకమైన ఖాన్ అకాడమీ డిజిటల్ సర్టిఫికేట్లను పొందారు. గురువారం పాఠశాల అసెంబ్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మూల రవీందర్ రెడ్డి ఈ ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఫిబ్రవరి నెలలో 60 నిమిషాలకు పైగా నిరంతరంగా డిజిటల్ ప్లాట్ఫా శిక్షణ పొందడమే కాకుండా, గణితం మరియు సైన్స్ సబ్జెక్టులలో ఈ విద్యా సంవత్సరంలో 9 కంటే ఎక్కువ క్లిష్టమైన నైపుణ్యాలను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఈ గుర్తింపు లభించిందని తెలిపారు. ముఖ్యంగా, విద్యార్థులను ఈ దిశగా ప్రోత్సహించి, వారికి నిరంతరం మార్గదర్శనం చేసిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయుల చొరవ మరియు ప్రభుత్వం కల్పించిన (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) విద్యా వనరుల వల్లే గ్రామీణ ప్రాంత విద్యార్థులు నేడు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పోటీ పడుతున్నారని ఆయన కొనియాడారు. ఈ విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని, డిజిటల్ లెర్నింగ్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని ఆకాంక్షించారు. ఈ వేడుకలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు ఇతర సిబ్బంది పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.




## సనాతన బస్తి హిందూ సమ్మేళనం

ఆర్మూర్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): ఆర్మూర్ హిందూ సంస్కృతి సాంప్రదాయాలు, ఆచారాలు, దేవాలయాల విశిష్టత, ఆహారపు అలవాట్లు ప్రపంచానికే ఆదర్శమని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి లక్ష్మణరావు అన్నారు. ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని కొటార్మూర్ బస్తి హిందూ సమ్మేళన అధ్యక్షుడు పుట్టి మురళి అధ్యక్షతన జరిగిన సనాతన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని హిందూ బంధువులను ఉద్దేశించి మాట్లాడారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని హనుమాన్ చాలీసా తో ప్రారంభం చేసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ప్రధాన వక్తలు మాట్లాడారు. సీర్లంచా అశోక్ వాఖ్యాతగా వ్యవహరించగా వక్తలు మాట్లాడారు. నేటిసంస్కృతి సంప్రదాయాలపై అదిలాబాద్ జిల్లా నుండి వచ్చిన ఫణితుల మేఘనాథ్ శర్మ, జిల్లా కేంద్రానికి చెందిన బ్రహ్మశ్రీ బాల్యపల్లి సుబ్బారావు గురుస్వామిలు హిందూ సంస్కృతి సాంప్రదాయాలపై హిందూ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న హిందువులకు సనాతన ధర్మం గురించి విశ్లేషించి వివరించారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన ప్రధాన కార్యదర్శి బి లక్ష్మీనారాయణ, విశాఖ గంగారెడ్డి, నార్లపురం రాజేశం, లక్ష్మీ నరసయ్య, రుద్ర మధు, సంపత్, లక్ష్మీనారాయణ, గటడి శంకర్, సీర్లంచా అశోక్, హరి ప్రసాద్, కౌన్సిలర్ ఖందేశ్ ప్రశాంత్, లింబాద్రి, పోశెట్టి, దేవి యూత్ రాము, దేవి యూత్ సభ్యులు, తిరుమల కాలనీ గంగాధర్, తిరుమల కాలనీ సభ్యులు, రవీందర్ గౌడ్, విశాఖ కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ముందస్తు బడిబాటకు ఊపు

**- దూపల్లిలో ఇంటింటి ప్రచారం.**
**- తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన.**

రెంజల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): ప్రజా పాలనలో భాగంగా చేపట్టిన ముందస్తు బడిబాట కార్యక్రమం మండలంలోని దూపల్లి గ్రామంలో ఉత్సాహంగా ప్రారంభమైంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఉదయం 7 గంటలకే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవ రెడ్డి మాట్లాడుతూ., ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామంలోని విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివేలా తల్లిదండ్రులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల చొరవకు తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించిందని, చాలా మంది తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్షులు బి. సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు బి. వెంకటలక్ష్మి, కృష్ణ, ప్రభాకర్, రాజేశ్వర్, రాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, సురేష్, రాధా తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థాయి అవగాహనతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెంచే దిశగా ముందస్తు బడిబాట కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది.



# రెంజల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం

**- సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష.**



రెంజల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): రెంజల్ మండల కేంద్రంలో గురువారం స్పెషల్ ఆఫీసర్ కృష్ణవేణి అధ్యక్షతన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రగతిపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కొత్త పెన్షన్లు మంజూరు చేయడం, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు వేగవంతం చేయడం, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక సరఫరా కల్పించాలనే అంశాలను స్థానిక సర్పంచ్ లలిత బుజ్జి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే అమలులో ఉన్న సంక్షేమ పథకాల పరిస్థితిని మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షురాలు లచ్చావర్ సుహాసిని నితిన్ వివరించారు. ప్రజలకు పథకాల లబ్ధి సమర్థవంతంగా చేరేలా అధికారులు కృషి చేయాలని సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్, హెల్త్, పోలీస్, రెవెన్యూ, ఐకేపీ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు లలిత బుజ్జి, లచ్చావర్ సుహాసిని నితిన్, రెమ్మ భానుచందర్, ఈరబోయిన మల్లేష్, ధనుంజయ్, వాగ్మారె మాధవ్, సవిత నరేష్, నర్సవ్వ, తెలంగాణ శంకర్, గియాజోద్దీన్, ఎత్తరి మాధవి సాయిలు, జుబేర్ తదితరులు హాజరయ్యారు. ప్రభుత్వ అధికారులు ఎంపీడీవో వారణాసి కమలాకర్, ఎంపీవో రఫీ, తహసీల్దార్ శ్రవణ్ కుమార్,స్థానిక పోలీస్ అధికారులు, ఐకేపీ ఏపీఎం మోహన్, అగ్రికల్చర్ ఏఓ సిద్ధరామేశ్వర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ షాహిస్తా ఫెర్దోస్, ఎంఈవో ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొనడం జరిగింది. ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి వేగంగా అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సమావేశంలో నిర్ణయించారు.



## నాగిరెడ్డిపేట్ మండల జాగృతి పద్మశాలి అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్ నియామకం





నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 16(మనం న్యూస్ ): కామారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షుడు ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపేట్ మండల జాగృతి పద్మశాలి అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్ను నియమించారు. నూతన అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ., తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పద్మశాలి సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మండలంలో సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువతను సమీకరించి సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. జిల్లా జాగృతి అధ్యక్షుడు సంపత్ గౌడ్ మాట్లాడుతూ., ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో మండలంలో సంఘ కార్యకలాపాలు మరింత చురుకుగా కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సభ్యులంతా ఐక్యంగా పని చేస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బాగారెడ్డి, మండల యువ అధ్యక్షుడు ఫహీమ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీను, మండల మైనారిటీ అధ్యక్షుడు ఎజస్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడిని అభినందించారు.

## కామారెడ్డిలో కలెక్టరేట్లో జాబ్ మేళ

**- నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో అవకాశాలు.**

**- జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రజిని కిరణ్**

కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 18న శనివారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్లోని మొదటి అంతస్తు, గది నెం.121లో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రజిని కిరణ్ తెలిపారు.

ఈ మేళలో గూగుల్ పేకు సంబంధించిన ఉద్యోగాలు అందుబాటులో ఉండగా, ఇంటర్/డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.18,000తో పాటు ఇన్సెంటివ్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. బైక్ తప్పనిసరి కాగా, పురుషులకు మాత్రమే ఈ అవకాశాలు అందుబాటులో ఉంటాయి. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ల రెండు సెట్లు, ఆధార్ కార్డు ప్రతులతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9704412792, 6305743423 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## అన్నదానం సైతం ఆధ్యాత్మిక సేవనే..





వేల్పూరు, ఏప్రిల్ 16 ( మనం న్యూస్): వేల్పూర్ పట్టణ సమీపంలోని సాయిబాబా దేవాలయంలో సాయిబాబా బాటలో నడుస్తూ, అన్నదాతలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేయడాన్ని పుణ్యకార్యంగా భావిస్తూ వేల్పూరుకు చెందిన నీరడి ఆకాంక్ష మహంత్ దంపతులు, నిజామాబాద్ కు చెందిన అఖిలేశ్వర్ దంపతులు, బాచన్ పల్లికి చెందిన బొందుగుల జయశ్రీ వెంకటేశ్వర్లు దంపతులు విశేషంగా మహా అన్నదానం చేశారు. అన్నదాతలను కమిటీ సభ్యులు, ఆలయ అర్చకుడు అనురాగ్ పాండే శాలువాతో సన్మానించి ఆశ్రమాలయ వ్యవస్థాపకులు, కుండలిని జ్ఞానయోగి, అవధూత బ్రహ్మ, స్పర్శ జ్ఞాని గోవిందగిరి స్వామి వారి చిత్రపటాన్ని జ్ఞాపికగా బహుకరించారు. ధ్యాన మందిరంలో భజన కళాకారులు సామూహిక భజనలు చేశారు. తీవ్రమైన ఎండలో సైతం సాయి పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి అంటూ సామూహికంగా ఆలపించారు. ఇట్టి మహత్కార్యంలో కమిటీ సభ్యులు ఇరుపాజి దామోదర్ గౌడ్, రాజారపు బాల్ రాజ్ (సాయిరాం బాలరాజ్) అబ్బగోని జగదీశ్వర్ గౌడ్, దమ్మాయి లక్ష్మి, కుంట సువర్ణ సాయరెడ్డి, గడ్డం మల్లేష్, మెండే పద్మిని మహేందర్ దంపతులు, శివాలయం అర్చకుడు బోనగిరి గంగాధర్, ఆంధ్ర స్వామి, కొండ అశోక్ గౌడ్, కోరెం నర్సాగౌడ్, సాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌లు ప్రారంభం

భీంగల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్): భీంగల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడానికి అడ్మిషన్ లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.సతీష్ గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించి దోస్త్ నోటిఫికేషన్ ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని వెల్లడించారు.తమ కళాశాల లో బీ.ఏ(హెచ్ఈపీ, కంప్యూటర్ అప్లికేషన్స్), బీ.కామ్ (కంప్యూటర్స్), బీఎస్సీ(ఎంపీసీఎస్ అండ్ ఎంపీసీ), బీఎస్సీ(బీజెడ్సీ) గ్రూప్లలో అడ్మిషన్ లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# దేవక్కపేట్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



భీంగల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనినే రైతులు ధాన్యం విక్రయించాలని బంజారా ఎస్టీ సేల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్ అన్నారు. భీమ్గల్ మండలం దేవక్కపేట్ గ్రామంలో గురువారం ఐకేపీ వారి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముఖ్యఅతిథిగా మండల్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్,మాజీ ఎంపీపీ కన్నె సురేందర్ హాజరై స్థానిక గ్రామ సర్పంచ్ మలావత్ పూజ అజయ్ ఉప సర్పంచ్, స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రారంభమైన వరి ధాన్యం కేంద్రాలను రైతులకు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు తమ వరి ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వానికి విక్రయించుకునే అవకాశాన్ని ఈ కేంద్రం కల్పిస్తుంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాలవత్ పూజ (అజయ్) మాట్లాడుతూ., రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఏఈఓ భార్గవ్, ఐకేపీ సీసీ గడాల రఘుపతి, గ్రామ పాలక వర్గం సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షుడు నాగరాజ్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రజా పాలన కార్యక్రమం

బోధన్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): బోధన్ పట్టణంలో గురువారం టీటీడీ కళ్యాణ మండపంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పట్టణం స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ మాట్లాడుతూ., తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు పథకాలు బోధన్ మున్సిపాలిటీలో విజయవంతంగా అమలౌతున్నాయని అన్నారు. పట్టణంలోని 351 నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రతి లబ్ధిదారునికి 5 లక్షల ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. 9 వేల చేయూత పింఛన్లు అందజేయడం జరుగుతుందని అన్నారు. మహా లక్ష్మీ, గృహ జ్యోతి, రైతు భరోసా, రూ 500 కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా అమలవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, వైస్ చైర్మన్ ఇలియాస్, మున్సిపల్ కౌన్సిలర్ లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇండోర్ స్టేడియం పనులపై కలెక్టర్ పరిశీలన



కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం పక్కన నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు. నిర్మాణ పురోగతిని సమీక్షించి, పనుల నాణ్యతపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు. ఇక్కడ నిర్వహిస్తున్న కబడ్డీ సమ్మర్ కోచింగ్ క్యాంపును సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడి వారిని ప్రోత్సహించారు. స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, యోగా హాల్, ఇండోర్ గేమ్స్, జిమ్, రైఫిల్ షూటింగ్, స్క్వాష్ కోర్ట్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువతలో క్రీడలను ప్రోత్సహించేందుకు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎన్.వై. గిరి, పబ్లిక్ హెల్త్ డీఈ సంతోష్, కాంట్రాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటి అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం





**- జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్. సిద్ధాకర్.**
**- గౌరవ అతిథిగా పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఇందు ప్రియా.**

కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): కామారెడ్డి పట్టణ కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గృహ అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్. సిద్ధాకర్, ఇన్చార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఆర్. రవీందర్ రెడ్డి, సిబ్బంది కలిసి ఎన్జీఓస్ కాలనీని సందర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఇందు ప్రియా, కాలనీవాసులు హాజరయ్యారు. గ్యాస్ లీకేజీలు, నూనెతో సంభవించే అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా వివరించారు. స్టాప్, డ్రాప్ అండ్ రోల్ విధానం, చిన్న మంటలను బ్లాంకెట్తో అదుపు చేసే పద్ధతులను ప్రదర్శించారు. ఎల్పీజీ సిలిండర్ల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై సూచనలు ఇచ్చారు. కాలనీవాసులు కార్యక్రమాన్ని అభినందించారు. ఫైర్ సర్వీస్ వీక్ - 2026 సందర్భంగా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి తెలిపారు.



# గ్రామాల్లో జాగృతి బలోపేతం

**- పలువురు నాయకుల నియామకం**

నాగిరెడ్డిపేట్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్): కామారెడ్డి జిల్లా జాగృతి అధ్యక్షులు ఎదురుగట్ల సంపత్ గౌడ్, నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షులు సుభాన్ రెడ్డి ఆదేశాల మేరకు బాగారెడ్డి, యూత్ ప్రెసిడెంట్ ఫహీమ్ సమక్షంలో మాల్తుమ్మెద, వదలపర్తి గ్రామాల కార్యకర్తలు జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా వదలపర్తి గ్రామ జాగృతి అధ్యక్షులుగా కే. ఆంజనేయులు నియమించబడగా, మాల్తుమ్మెద గ్రామ జాగృతి యువ అధ్యక్షులుగా సాయిబాబా, బీసీ సెల్ అధ్యక్షులుగా వెంకటరాములు, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ప్రవీణ్ నాయక్ నియమితులయ్యారు. అలాగే గాడయి సాయిలు కూడా జాగృతిలో చేరారు.ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధిరాములు, ఎజాస్, ఖలీల్, యాదగిరి, ప్రవీణ్, జాకీర్, బలరాం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీబాయి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులకు ప్రవేశాలు ప్రారంభం

**- జిల్లా యువజన క్రీడల అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్**

కామారెడ్డి, ఏప్రిల్ 16 ( మనం జిల్లా ప్రతినిధి ): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని గ్వాలియర్లోని లక్ష్మీబాయి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 2026 - 27 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ , పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్, ఫిట్నెస్ మేనేజ్మెంట్, స్ట్రెంత్ అండ్ స్పోర్ట్స్ కండిషనింగ్, బీపీఈడ్, ఎంపీఈడ్, ఎంఎస్సీ (స్పోర్ట్స్ సైన్సెస్), ఎంఏ (యోగ), స్పోర్ట్స్ మేనేజ్మెంట్, క్రీడా జర్నలిజం వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హతలు, ప్రవేశ విధానం తదితర వివరాలకు అధికారిక వెబ్సైట్ను సందర్శించాలని సూచించారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని క్రీడల రంగంలో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆయన కోరారు.

# బీజేపీ ఎంపీ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి

**- ఎమ్మెల్యే వేముల**

భీంగల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తేజస్వి సూర్య వాఖ్యలపై తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు పూర్తిగా అవివేకపూరితమైనవని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా చట్టాలకు లోబడి పార్లమెంట్ ప్రక్రియ ద్వారా ఒక రాష్ట్రం ఏర్పడటాన్ని దేశ విభజనతో ముడిపెట్టి శత్రుదేశమైన పాకిస్థాన్ తో పోల్చడం క్షమించరాని నేరమని, ఇది దేశద్రోహానికి సమానమని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన దీర్ఘకాల పోరాటం, వేలాది అమరుల త్యాగాలను అవమానించేలా బీజేపీ ఎంపీ తేజస్వి వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేసిన ఎంపీపై వెంటనే చర్యలు తీసుకుని పార్లమెంట్ నుండి సస్పెండ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తేజస్వీ సూర్యను కోరారు.రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన తెలంగాణ దేశానికి రోల్ మోడల్గా నిలుస్తుండటాన్ని బీజేపీ తట్టుకోలేకపోతోందని, బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య అహంకారపూరిత వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటును ఇండియా- పాకిస్థాన్ విభజనతో పోల్చడం అంటే పార్లమెంట్ ను, 140 కోట్ల దేశ ప్రజలను అవమాన పరచడమేనని అన్నారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు అదే తరహాలో ఉంటే, విభజన బిల్లుకు అప్పట్లో బీజేపీ ఎందుకు మద్దతు తెలిపిందని ప్రశ్నించారు.ప్రధాని నరేంద్ర మోడీ కూడా గతంలో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. నాడు మోడీ అయినా, నేడు తేజస్వి సూర్య అయినా తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారని అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి




తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అవమానకరంగా మాట్లాడుతుంటే అదే పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న తెలంగాణకు చెందిన 8 బీజేపీ,8 కాంగ్రెస్ ఎంపీలు మౌనం వహించడం సిగ్గుచేటు. తెలంగాణలో గెలిచిన ప్రజాప్రతినిధులు ఢిల్లీలో రాష్ట్ర గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందని గుర్తుచేశారు.తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా సభలో తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు దిష్టి బొమ్మల్లా మిగిలారు. తెలంగాణ నుండి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి, సహాయమంత్రి బండి సంజయ్ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి అన్నారు.ఒకవేళ అదే సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు లోక్సభలో ఉంటే బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సంగతి ఏమిటో తేల్చేవారు, పార్లమెంట్ ను స్తంభింపజేసి వారికీ తగిన సమాధానం ఇచ్చేవారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు, పార్లమెంట్కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా ప్రజలు సహించరని, బీజేపీ నేతలు కొరవి తో తలగోక్కోవద్దని తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ ఏర్పాటు పై బీజేపీ వైఖరిని తెలంగాణ ప్రజలు గమనించాలని కోరారు.

## గ్రామాలలో అభివృద్ధి అభివృద్ధి చెందేలా కృషి చేయాలి

**- ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్.**

భీంగల్, ఏప్రిల్ 16 ( మనం న్యూస్ ): గ్రామీణాభివృద్ధి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వ అధికారులు పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజా పాలన ప్రగతి-ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 39వ రోజు భీంగల్ మండల స్థాయి సమావేశం గంగుల సంతోష్ కుమార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో, శ్రీయుత జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస రావు నేతృత్వంలో సమావేశం నిర్వహించడం జరిగింది.తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి పథకం లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 500 కు గ్యాస్ సిలిండర్ సన్న రకం వడ్ల కొనుగోలు బోనస్ చేయూత పెన్షన్లు, గృహ జ్యోతి కార్యక్రమంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి ఎస్.హెచ్.జి లో బ్యాంకు లింకేజీ, వడ్డీలేని రుణాలు ఇందిరమ్మ చీరలు మొదలగు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఆయా శాఖల అధికారులు వివరించడం జరిగింది. ప్రభుత్వ అందించబోతున్న కొత్త పథకాలు అల్పార పథకం ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా స్కీమ్,మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు విస్తరించడం ఇంటర్మీడియట్ స్థాయి దివ్యాంగ విద్యార్థులకు మోటర్ వాహనాలు పంటల వైవిధ్యీకరణ,సహజ సేంద్రియ వ్యవసాయంపై సమావేశంలో చర్చించడం జరిగింది.అలాగే రోడ్డు భద్రత నియమాలపై ప్రజలు మోటారు వాహనాల పై ప్రయాణం చేసినప్పుడు హెల్మెట్ ధరించడం,కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించడం ట్రాఫిక్ నియమాలు పాటించడం రహదారి భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు ఉప సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు రైతులు యువకులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## బిచ్కుందలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

బిచ్కుంద, ఏప్రిల్ 16 (మనం న్యూస్ ): బిచ్కుంద మండలం కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక) మండల స్థాయి కార్యక్రమం గురువారం ఎంపీడీవో గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మున్సిపల్ చైర్మన్ సీమ షట్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కవిత ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి ప్రేమ్ సెట్, తాసిల్దార్ వేణుగోపాల్, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ డెలికేట్ విట్టల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, గోపాల్ రెడ్డి పటేల్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు నౌషా నాయక్, మారుతి, బిచ్కుంద మండల కేంద్రంలోని సర్పంచులు మరియు పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు విఠల్ రెడ్డి మాట్లాడుతూ., తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరు గ్యారంటీ' పథకాలు మండలంలో సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా 23 గ్రామపంచాయతీ లో 557ఇల్లు మంజూరు కావడంతో అందులో 43 ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకున్నారు మిగతావారు కూడా పూర్తి చేసుకోవాలని చెప్పారు. నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నామని పేర్కొన్నారు. 23 గ్రామ పంచాయతీలో చేయూత పింఛన్ల ద్వారా సుమారు 4880 మంది పింఛన్లు అందిస్తూ వారి జీవితాల్లో భరోసా కల్పిస్తున్నామని వివరించారు. మహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు భరోసా, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన వార్డు సభల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో మండల ప్రజలు పాల్గొన్నారు.



